వేదా డే వాల్ పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని పెద్ద గొల్లలపాలెం గ్రామంలో స్థానిక సప్తగిరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 30వ తేదీ సోమవారం వేదాడే నిర్వహించడం జరుగుతుంది. దీనికి సంబంధించిన పోస్టర్ విశాఖ రూరల్ జిల్లా అధ్యక్షుడు, పెందుర్తి నియోజకవర్గం శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు సోదరులు పంచకర్ల వెంకటేశ్వరరావు చేతుల మీదగా పోస్టర్ ను శనివారం సాయంత్రం ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు ఇందల రమణ, మండల పార్టీ అధ్యక్షుడు కనకరాజు, గండి దుర్గాప్రసాద్, ఉగ్గిన రాము, బంతి కోళ్ల పద్మ, బోకం సోమినాయుడు, బలిరెడ్డి ప్రసాద్, కే.శంకర్, తాటిపాముల శేఖర్, పల్లి మంగరాజు, నీటిపల్లి కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో యోగా తరగతులు ప్రారంభం

విశాలాంధ్ర - చోడవరం రూరల్: మండలంలోని గాంధీ గ్రామం పంచాయతీలో గల శ్రీ విజ్ఞాన్ పబ్లిక్ స్కూల్లో యోగా తరగతులను ప్రారంభించినట్లు డైరెక్టర్ ఎం.ఎం.కె.రాజు ఆదివారం ఓ ప్రకటన లో తెలియజేసారు. స్థానిక పతంజలి యోగ శిక్షణా కేంద్రం గురువు పుల్లేటి సతీష్, భోగవిల్లి గణేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. యోగ ధ్యానం ద్వారా విద్యార్థుల్లో ఏకాగ్రత ఏర్పడి చదువులు చురుకుదనం ఉంటుందని యోగ శిక్షకులు తెలిపారు.

పద్మావత్ నగర్‌లో రెండు బైకులు ఢీ

ఒక వ్యక్తి మృతి, మరొక వ్యక్తికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: విజయనగరం పట్టణం పద్మావతి నగర్‌లో ఆదివారం రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరోక వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నటరాజ్ కాలనీకి చెందిన పెడాడ నూకరాజు(41) అక్కడికక్కడే అనే వ్యక్తి మృతిచెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గాయాలైన దుర్గా గణేష్‌ను ఆసుపత్రికి తరలించారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం జిల్లా సర్వజన ఆస్పత్రి పోస్ట్ మార్టం గదికి తరలించారు. విజయనగరం రూరల్ ఎస్సై వి.అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి

విశాలాంధ్ర - బొబ్బిలి : పట్టణం పాత బొబ్బిలి నుంచి బొబ్బిలి వచ్చే పెట్రోల్ బంక్ ఎదురుగా గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో పట్టణం రాతి పని వారి వీధికి చెందిన, అలమండ ఉదయరాజ్ (16) అక్కడే మృతి చెందాడు. మృతుడు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. ప్రమాద సంఘటనపై పట్టణ సీఐ సతీష్ కుమార్ ఆదేశాల మేరకు ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రమాదనగల కారణాలపైన పూర్తిస్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జ్ఞాన ప్రసాద్ తెలిపారు.

10 టీవీ స్టాఫ్ రిపోర్టర్‌పై ఎస్ఐ దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: సీనియర్ జర్నలిస్ట్, 10టీవీ స్టాఫ్ రిపోర్టర్ ఎం.ఎం.ఎల్.నాయుడుపై విజయనగరం టూ టౌన్ ఎస్ఐ మురళి చేసిన దౌర్జన్యాన్ని పూల్ బాగ్ అయ్యప్పనగర్ కాలనీ పోరాట సమితి తీవ్రంగా ఖండిస్తుందని, ఈ మేరకు ఆదివారం పలువురు కమిటీ సభ్యులు జర్నలిస్ట్ నాయుడుని కలిసి తమ సంఘీభావాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ అయ్యప్పనగర్‌లో నివాసం ఉంటున్న రిటైర్డ్ డీఈవో ఎస్.అప్పలనాయుడుపై జరిగిన హత్యాయత్నంకు సంబంధించి జర్నలిస్ట్ నాయుడు తన మొబైల్ ఫోన్‌లో విజువల్స్ తీస్తుండగా, టూ టౌన్ ఎస్ఐ మురళి దౌర్జన్యం చేసి ఫోన్ లాక్కున్నారని, అంతటితో ఆగకుండా తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారని అన్నారు. రెండు దశాబ్దాలు పైగా జర్నలిస్టుగా, జర్నలిస్ట్ సంఘం నాయకుడుగా నాయుడు జిల్లాలో సేవలు అందిస్తూ, జిల్లాలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని, అటువంటి ఆయనపై ఎస్ఐ దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. వెంటనే సదరు ఎస్ఐ మురళిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు సుదర్శనరావు, సెక్రటరీ ఎన్.సుధీర్, యూ.ఎస్.రవికుమార్ (సీఐటీయూ జిల్లా సెక్రటరీ), అచ్యుమాంబ (హ్యూమన్ రైట్స్ కమిటీ సభ్యులు), ఎం.మోహన్ రావు (అడ్వకేట్), కె.వరప్రసాద్, ఆదినారాయణ రావు, రిటైర్డ్ టీచర్, శ్రీనివాసరావు (హేమశ్రీ కన్స్ట్రక్షన్), రెడ్డి, సంతోష్, మహేష్, నారాయణరావు (అయ్యప్ప టవర్స్) పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం - పట్టించుకోని సిబ్బంది

విశాలాంధ్ర - కే.కోటపాడు: మండలం చౌడువాడలో తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగటంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రజలకు నిత్యం త్రాగునీరు అందించే మోటార్లు పనిచేయకపోవడంతో నీటికి ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి గాలులు వర్షానికే విద్యుత్తు నిలిపివేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. గ్రామంలో విద్యుత్ లైన్ మెన్ , ఏఎల్ఎం, ప్రైవేట్ సిబ్బంది ఉన్న సకాలంలో విద్యుత్ లోపాలను సరి చేయటం లేదని అంటున్నారు. గ్రామస్తులు పలుమార్లు ఒత్తిడి చేస్తే తప్ప గ్రామానికి విద్యుత్ సరఫరా చేయటం లేదు. గ్రామానికి త్రాగునీటిని అందించే పంపు హౌస్ లు కొద్ది దూరంలో ఉన్నాయి. గ్రామంలో విద్యుత్తును పునరుద్ధరిస్తున్నారు తప్ప పంపు హౌస్ ల వద్ద లోపాలను సరి చేయటం లేదు. మహిళలు ప్రతిరోజు ఉదయం 6 గంటలకు త్రాగునీటి కోసం వీధి కులాయిల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఎప్పుడు నీరు వస్తుందో తెలియని పరిస్థితుల్లో ఉన్నారు. కొళాయి నీరు సకాలంలో రాకపోవడంతో కూలీ పనులకు వెళ్లే మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ శివారు పంపు హౌస్ లు ఉన్న ప్రాంతంలోనే రైతుల పొలాలు ఉన్నాయి. ప్రతి రైతుకు నాలుగైదు పాడి పశువులు ఉన్నాయి. రైతులు విద్యుత్ మోటార్ల ద్వారా పశువులకు కనీసం త్రాగునీరు అందిద్దామన్న విద్యుత్ సరఫరా ఉండటం లేదు. గ్రామస్తుల అవస్థలను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇల్లు, దుకాణాలు, భూములకు ఒకేసారి నష్టపరిహారం ఇవ్వాలి

విశాలాంధ్ర - అచ్యుతాపురం: అనకాపల్లి నుండి అచ్చుతాపురం రోడ్డు నిర్వాసితులకు ఇల్లు, షాపులతో పాటు భూమికి నగదు రూపంలో నష్టపరిహారం ఇవ్వాలనీ నిర్వాసితుల సంఘం కన్వీనర్ ఆర్.రాము, ఎస్.బ్రహ్మాజీ డిమాండ్ చేశారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులు ఇళ్లకు, దుకాణాలకు అతి తక్కువ రేటు కట్టి లిస్టులు ప్రకటించడం అత్యంత దుర్మార్గం అన్నారు. నిర్వాసిత గ్రామాల ప్రజలకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, పునరావసం కల్పించేలాగా భరోసా ఇచ్చి న్యాయం చేయాలని, టిడిఆర్ బాండ్లు ప్రతిపాదనలను విరమించుకోవాలన్నారు. రోడ్డు నిర్వాసితులకు తీవ్ర అన్యాయం చేసే విధంగా బాండ్లు పేరుతో మోసం చేస్తున్నారని గత ప్రభుత్వం గ్రామ రెవెన్యూలు వారిగా 15000 నుండి 25000 గజానికి ఇస్తామని అందరితో సంతకాలు చేయించుకొని ఇప్పుడు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత సర్వస్వం కోల్పోతున్న నిర్వాసితులను రోడ్డున పడే విధంగా బాండ్లు ఇస్తామనడం అన్యాయమన్నారు. నిర్వాసితులకు బాండ్లు వద్దు ఇళ్లకు భూములకు ఒకేసారి నగదు ఇవ్వాలని లేదంటే నిర్వాసితులను ఐక్యం చేసి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రోడ్డు నిర్వాసితులు, రైతు సంఘం నాయకులు కర్రి అప్పారావు, రామ సదాశివరావు, ఎస్.కనుమనాయుడు, బుద్ధ రంగారావు తదితరులు పాల్గొన్నారు.

బీసీ వర్గీకరణ మేరకు రిజర్వేషన్లు అమలు చేయాలి

జిల్లా యాత సంక్షేమ సంఘం డిమాండ్

విశాలాంధ్ర - అనకాపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్ అమలపర్చాలని జిల్లా యాత సంక్షేమ సంఘం సమావేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఆదివారం పట్టణంలో జరిగిన జిల్లా సమావేశంలో అధ్యక్షుడు పెంకే మారేష్ మాట్లాడుతూ వచ్చే స్థానిక సంస్థలైన సర్పంచ్, ఎంపీటీసీ,జడ్పిటిసి స్థానాలకు బిసి రిజర్వేషన్లు వర్గీకరణ ప్రకారం అమలుపరచాలని ఆయన అన్నారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, రంగాలలో అమలులో ఉన్న బీసీ రిజర్వేషన్ల వర్గీకరణ, రాజకీయ రంగంలో లేకపోవడం విచారకరమని ఆయన అన్నారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల నాటికి బీసీ వర్గీకరణ ప్రకారం రిజర్వేషన్లను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు ఏ బి సి డి క్యాటగిరి ప్రకారం రిజర్వేషన్లు కేటాయించి అమలు పరచాలని ప్రభుత్వాన్ని మారేష్ కోరారు. ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా బీసీ రిజర్వేషన్లు పూర్తిగా బిసి ఆధిపత్య కులాలే అనుభవిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం అణగారిన వర్గాల రాజకీయ ప్రయోజనాలను కాపాడే విధంగా బీసీ రిజర్వేషన్లను వర్గీకరించి అమలు చేయాలని కోరారు. లేనియెడల ఇతర అణగారిన బీసీ కులాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.రాష్ట్రంలో యాత కార్పొరేషన్ పాలకవర్గాన్ని నియమించడంలో ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి వహించడం మంచిది కాదని సమావేశం అభిప్రాయపడింది. యాత కార్పొరేషన్ పాలకవర్గాన్ని వెంటనే ప్రకటించాలని సమావేశం ప్రభుత్వాన్ని కోరింది. ఎంబీసీ కార్పొరేషన్ పదవి యాతకులానికి చెందినవారికి కేటాయించాలని సమావేశం ప్రభుత్వం డిమాండ్ చేసింది. యాతకులస్తుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని, యాత కులస్తుల పిల్లల విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం ప్రత్యేక హాస్టళ్ళు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని సమావేశం కోరింది.ఈ సమయంలో జిల్లా యాత సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు పిల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి గుత్తుర్తి అప్పారావు, న్యాయవాది ఓడిబోయిన రాంబాబు మొదలవారు మాట్లాడారు.

పూర్వ విద్యార్థుల సహకారంతో బాలికల టాయిలెట్ నిర్మాణం

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కళాశాల ఆవరణలో 2.30 లక్షల రూపాయలతో బాలికల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఐ.వి.వి సత్యవతి వాటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి కళాశాల నాక్ గ్రేడ్ కొరకు వెళ్లే ముందు ఆలుమని అసోసియేషన్ తప్పనిసరి అన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన గౌరీ శంకర్ మాస్టారు, గుప్తా,బాబీ ఇతర పెద్దలందరికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బాబీ మాట్లాడుతూ మేము చదువుకున్న కళాశాల స్కూలుకు ఉడత భక్తి సహాయమేనని ,ఈ కార్యక్రమానికి సహకరించిన మా యొక్క స్నేహితులందరికీ ధన్యవాదాలు తెలుపుతున్నాను అని తెలియజేశారు. అసోసియేషన్ సెక్రటరీ గౌరీ శంకర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ఎంతోమంది పూర్వ విద్యార్థుల సహకారంతోపాటు జుత్తాడ హెచ్ఎం వాడ్రేవు శేషగిరి మాస్టారు కళాశాలకు 50 వేల రూపాయలు సహాయం చేశారని వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజి, వివిఎస్ఎన్ మూర్తి, గుప్త, ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహా న్యూస్‌పై దాడి అప్రజాస్వామికం

విశాలాంధ్ర, నర్సీపట్నం: హైదరాబాదులోని మహా టీవీ న్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని, ప్రజాస్వామ్యంలో నాలుగవ స్తంభంగా ఉన్న మీడియా పట్ల ఈ విధంగా వ్యవహరించడం సరైంది కాదని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపీయూడబ్ల్యూజే) రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.బి.ఎల్. స్వామి , అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు జోగినాయుడు , జిల్లా కార్యదర్శి చంద్రరావు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్, ఖండించారు. వార్త ప్రసారాల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని ఖండించటం గాని ,చట్టపరంగా ముందుకు వెళ్ళటం గాని చేయాలే తప్ప మీడియా కార్యాలయాలపై దాడులకు దిగటం ప్రజాస్వామ్యంలో సరైంది కాదని అన్నారు. ఇలాంటి దాడులు రాజ్యాంగం ప్రసాదించిన భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తున్నాయని చెప్పారు.ఈ దాడులకు పాల్పడిన వారిపై ప్రభుత్వం చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

నాటు తుపాకీలు వెంటనే అప్పగించాలి

విశాలాంధ్ర - గొలుగొండ: అనధికారికంగా ఎవరి వద్దయినా నాటు తుపాకీలు ఉన్నట్లయితే ఐదు రోజుల్లో పోలీస్ స్టేషన్కు అప్పగించాలని కృష్ణదేవిపేట ఎస్సై వై.తార్కేశ్వరరావు అన్నారు. నాటు తుపాకీలను అనధికారికంగా ఎవరి వద్ద ఉన్న చట్టరీత్యా నేరమని కావున స్వచ్ఛందంగా అటువంటి తుపాకీలు ఉన్నట్లయితే వెంటనే అప్పగించాలన్నారు. అలా కాకుండా ఎవరివరుద్ధమైన పట్టుబడినట్లైతే అటువంటి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే కేసులు నమోదు చేయడమే కాకుండా జైల్లో కూడా పంపడం జరుగుతుందని ఈ సందర్భంగా ఎస్సై తారకేశ్వరరావు తెలియజేశారు.

ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌ను వీక్షించిన బీజేపీ నాయకులు

విశాలాంధ్ర - అచ్యుతాపురం : స్థానిక మండల పార్టీ కార్యాలయంలో ఆదివారం బీజేపీ నాయకులు 123వ మన్‌కీ బాత్ కార్యక్రమాలను టీవీలో వీక్షించారు . ఈ సందర్భంగా యలమంచిలి నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు (బిజెపి నాయుడు) మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపట్టిన మన్‌కీ బాత్ కార్యక్రమం ప్రతి ఒక్కరూ చూడాలన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమం 123వ ఎపిసోడ్ కావటం గర్వంగా ఉందన్నారు . ఈకార్యక్రమంలో బిజెపి మండల పార్టీ అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు, ఓరుపుల జయశంకర్ , మామిడి సురేష్ కుమార్ , మేరుగు కాసుబాబు , బండారు నాయుడు, పీలా శ్రీను తదితరులు పాల్గొన్నారు .

ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

విశాలాంధ్ర - సబ్బవరం:మండలంలోని స్థానిక రేంజర్స్ డిఫెన్స్ అకాడమీ కళాశాలలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పోతల సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయనగరం పుష్పగిరి కంటి ఆసుపత్రి వారి సౌజన్యంతో తమ కళాశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించామన్నారు. ఈ వైద్య శిబిరంలో ఆప్తోమెట్రీ టెక్నీషియన్ డి. శ్రీను సుమారు 150 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించి, అందులో ముగ్గురికి కంటి అద్దం లు అవసరమని గుర్తించారు.అలాగే బయట నుండి వచ్చిన 35 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి, వారిని తమ ఆసుపత్రి వాహనంలో విజయనగరం ఆపరేషన్ నిమిత్తం తరలించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ టి. సూర్య ప్రకాషరావు, కె. శ్రీనివాస వర్మ, కళాశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర ప్రజానాట్యమండలి శిక్షణ తరగతులు జయప్రదం చేయండి

ప్రజానాట్య మండలి గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు

విశాలాంధ్ర - అనకాపల్లి : ప్రజానాట్యమండలి ఉత్తరాంధ్ర శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు కోరారు. ప్రజల చైతన్యం చేస్తూ ప్రభుత్వ విధానాలను ఎండగట్టే బాధ్యతను ప్రజా నాట్య మండలి తీసుకోవాలని దొరబాబు అన్నారు.ఆదివారం కోడిగంటి గోవిందరావు భవనంలో జరిగిన ప్రజానాట్యమండలి సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు రాజునాయుడు, దేముడుబాబు మాట్లాడుతూ కళాకారులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసి 45 సంవత్సరాలకే 5000 పెన్షన్ ఇవ్వాలని కోరారు.తెలంగాణ ప్రభుత్వం లాగే సాంస్కృతిక మండల ఏర్పాటు చేసి ఉద్యోగం ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాత్ర వల్లి కొండబాబు, వియ్యపురాజు సెట్ సత్యనారాయణ, కెవి రమణ, కొండూరు రవీంద్ర, పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని దేవిపురంలో శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో శ్రీ వారాహీ నవరాత్రులలో భాగంగా 4 వ రోజు ఆదివారం ఉదయం నుండి శ్రీ మేరు మొదటి అంతస్థులో శ్రీ వారాహీ ఉత్సవం మూర్తి కి వచ్చిన భక్తులచే క్షీరాభిషేకం, షోడశోపచార సహిత కుంకుమ పూజలు నిర్వహించారు.వారాహీ మాతను విశేషంగా శ్రీ యంత్ర ముద్రిత బహు కాసులతో బహు సుందరం గా అలంకరించారు.ముందుగా అమ్మవారి క్షీరాభిషేకాలలో ఆదివారం సెలవు దినం కావడంతో అనేకానేక భక్తులు పాల్గొన్నారు.వచ్చిన భక్తులందరికీ గురుమాత శ్రీమతి అన్నపూర్ణమ్మ ఉచిత అన్నదాన కార్యక్రమం జరిపించారు. అనంతరం శ్రీ వరాహి మాతను పల్లకీ లో ఆశీనురాలిని చేసి నవ వర్ణ పుష్పాలతో అలంకరించి ఊరేగిస్తూ ద్వారపూజ లు గావిస్తూ మేళా తాళాలతో, ఆహుతులైన అనేక మంది భక్తులు, అమృత కన్యా గురుకుల విద్యార్థినుల కోలాటాలు, భజనలతో మహదానందంగా సాగింది.ఈ రోజు రాత్రికి తిరస్కరణీ వారాహీ హెూమం జరుగుతుంది. ఇందులో పాల్గోడం వల్ల మాయా భ్రాంతుల తొలగిపోయి, ప్రతికూల శక్తుల నుండి రక్షణ లభిస్తుంది అని గురుమాత అన్నపూర్ణమ్మ తెలిపారు. దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్ శ్రీ విద్యా ట్రస్ట్ కార్యదర్శి కందర్పరమా పర్యవేక్షణలో నిర్వహించారు.

మహిళా ఉద్యోగులను వేధిస్తున్న చోడవరం ఎమ్మెల్యే, కూటమి నాయకులు

- వర్గ పోరుకు బలవుతున్న ప్రభుత్వ ఉద్యోగులు
- సి.పి.ఎం. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న

విశాలాంధ్ర - చోడవరం: చోడవరం ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు, కూటమి నాయకులు నియోజక వర్గంలో ప్రభుత్వ మహిళా ఉద్యోగులను పలు వేధింపులకు గురి చేస్తున్నారని, తక్షణమే ఎమ్మెల్యేను భర్తరఫ్ చేయాల్సిందిగా మహిళ, ప్రజా, ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు సి.పి.ఎం. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డి.వెంకన్న ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎమ్మెల్యే రాజు, వారి వర్గీయులు, కూటమి నేతల రాజకీయ కక్షల నేపధ్య0లో బుచ్చయ్యపేట ఎంపీడీవో విజయలక్ష్మి ఇప్పటికే మృతి చెందారు. కాగా మరో వివాదంలో వడ్డాది కస్తూరిబా స్కూలు ప్రిన్సిపాల్, సీట్లు కేటాయింపులో గుండె పోటుకు గురయ్యారని ఆరోపిస్తున్నారు. నియోజక వర్గంలో టి.డి.పి., కూటమి నాయకులు వారి వర్గీయులు ప్రభుత్వ ఉద్యోగులు పై పెత్తనం చెలాయిస్తూ, మహిళా ఉద్యోగులను వేధింపులకు, మానశిక ఆందోళనకు గురి చేస్తు న్నారని అన్నారు. బుచ్చయ్య పేట మండలంలోని వడ్డాది కేజీబీవీ పాఠశాలలో ఆరవ తరగతి ప్రవేశాలలో నేతల కుమ్ములాట ప్రిన్సిపాల్ గుండు పోటుకు కారణం అయ్యింది. ప్రభుత్వ అధికారులు ప్రజలపై కూటమి నాయకులు నిసిగ్గుగా వ్యహరిస్తున్నారని, విశాఖ డైరి డైరెక్టర్ కీలక పాత్ర పోసిస్తున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న పేర్కొన్నారు. ఉద్యోగుల బదలీలు నుండి చివరకు పసిపిల్లలకు సిట్లు పంపిణీని కూడా వదిలి పెట్టక పోవడం అత్యంత దుర్మార్గమన్నారు. స్కూళ్లు, హాస్టల్సు విషయంలో కూటమి పెద్దలు ఎమ్మెల్యేలు జోక్యం చేసుకోవడం వల్ల సామాన్యులు తీవ్రంగా నష్ట పోతున్నారని తెలిపారు. నియోజకవర్గంలో పలు శాఖల అధికారులు ఉద్యోగులు ఎమ్మెల్యే, వర్గీయులు ప్రజా ప్రతినిధుల ఒత్తిడి తట్టు కోలేక దీర్ఘకాలిక సెలవులపై వెళ్ళిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల విధుల్లోకి జోక్యం చేసుకోవడం, తమ మాట వినకపోతే తమ ప్రాంతంలో ఉద్యోగం ఎలా చేస్తావ్ అంటూ బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు, తెలుగుదేశం నాయకుల బెదిరింపులతో ఆసుపత్రి పాలైన కేజీబీవీ ప్రిన్సిపాలు కు మెరుగైన వైద్య సౌకర్యం అందించాలని, పది రోజులు క్రితం బుచ్చయ్య పేట ఎంపిడివో గుండె పోటుతో చనిపోవడానికి కూటమి నాయకుల్లో కిలక సూత్రదారి విశాఖ డైరి డైరెక్టర్ కారణమన్నారు. వెంటనే వీటిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని, ప్రజల పైన, మహిళలు పైన సీ.ఎం. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే తక్షణమే చోడవరం ఎమ్మెల్యే కూటమి నాయకులను భర్త రఫ్ చేయాలని వారిపై క్రిమినల్ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ ను ఈనెల 25 వ తేదీన స్కూల్ సీటు విషయమై ఎమ్మెల్యే ప్రిన్సిపాల్ ను పార్టీ కార్యాలాయానికి పిలిపించుకొని తీవ్ర ఒత్తిడి చేయడం, దుర్భాషలాడటం మీరు, డ్యూటీ ఎలా చేస్తారో చూస్తామని బెదిరింపులకు పాల్పడడంతో కేజీబీవీ ప్రిన్సిపాల్ మానసిక ఒత్తిడి తట్టుకోలేక మూర్ఛ వచ్చి పడిపోయి గుండె పోటుకు గురయ్యారన్నారు. బాధితురాలు గుండెపోటు మానసిక ఆందోళనతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఘటన రాష్ట్ర వ్యాప్తంగా మహిళా ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఆకస్మిక తనిఖీల పేరుతో కొంతమంది ప్రజా ప్రతినిధులు, కూటమి నేతలు కేజీబీవీ మహిళా సిబ్బంది పట్ల అమర్యాదగా, అసభ్యంగా మాట్లాడుతూ మానసిక, లైంగిక వేధింపులకు గురి చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి సంఘటనలు ఉద్యోగుల గౌరవానికి, భద్రతకు విఘాతమన్నారు. వడ్డాది కేజీబీవి ప్రిన్సిపాల్ ఘటనపై ప్రభుత్వం తక్షణం స్పందించి న్యాయవిచారణ చేయాలని కోరారు. విద్యార్థుల సీట్లు పంపకంలో సిగ పట్లు పట్టిన జనసేన పార్టీ కీలక నేత షేక్ రసూల్, చోడవరం ఎమ్మెల్యే రాజు వర్గీయులపై సిబిఐతో న్యాయ విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని, మహిళా ఉద్యోగుల భద్రత కోసం ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందించి, అమలు చేయాలని, బుచ్చయ్యపేట ఎంపిడివో మృతిపైన, కెజిబివి ప్రిన్సిపాల్ గుండెపోటుకు కారకులపైన సమగ్రమైన ధర్యాప్తు జరిపించాలని మహిళ, ప్రజా, ఉద్యోగ సంఘాలు, సిపిఎం నాయకులు వెంకన్న డిమాండ్ చేస్తున్నారు.